# 24/7 నాణ్యమైన విద్యుత్

- పనుల పురోగతిలో ఏపీఈపీడీసీఎల్ ముందంజ
- జోన్–2 పరిధిలో సబ్ స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు
- 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో రూ.4.19 కోట్లతో పనులు
- పరిశ్రమలు, గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు



తుప్పు పట్టిన స్తంభాన్ని తొలగించి, కొత్తది వేస్తున్న సిబ్బంది



కేవీ లైన్ల స్తంభాల తీగలను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

**కంచరపాలెం:** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చర్యలు చేపట్టింది. కంచరపాలెం జోన్–2 డివిజన్ పరిధిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పనులు చేపట్టింది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన విద్యుత్ తీగల ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.4.19 కోట్లు నిధులతో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆదేశాలతో కంచరపాలెం జోన్–2 డివిజన్‌లోని 4 సబ్‌డివిజన్ (కంచరపాలెం, ఆటోనగర్, మల్కా పురం, గాజువాక)లకు చెందిన 13 అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయ ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. పరిశ్రమలు, గృహ వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు జోన్–2 అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుత విద్యుత్ సరఫరా, పంపిణీ సామర్థ్యం, భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు జోన్–2 పరిధిలోని సబ్ స్టేషన్ల మరమ్మతు పనులు చేపట్టినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కోటేశ్వర నాయుడు తెలిపారు.

**మూడు నెలలుగా చకచకా పనులు**

జోన్–2 డివిజన్ పరిధిలోని 13 సెక్షన్ల పరిధిలో విద్యుత్ పనులు చకచకా జరుగుతున్నాయి. పాడైన 33 కేవీ, 11 కేవీ మరియు ఎల్‌టీ విద్యుత్ ఇనుప స్తంభాలు, పాత వైర్లను మార్పు చేస్తున్నారు. రోడ్ క్రాసింగ్ వద్ద స్తంభాల ఎత్తు పెంచడం, ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ వైర్లను సరిచేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులను మార్చడం, విద్యుత్ లైన్లకు అతిదగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, సబ్‌స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నాయి. జనవరి 31నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా మూడు నెలలుగా అధికారులు పనులు చేపట్టారు.

**జోన్–2 లోని 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో పనులకు మంజూరైన నిధులు**

| సబ్ డివిజన్ కార్యాలయం | నిధులు |
|---|---|
| ఆటోనగర్ | రూ.48.12 లక్షలు |
| చినగంట్యాడ | రూ.23.08 లక్షలు |
| గాజువాక | రూ.30.05 లక్షలు |
| కంచరపాలెం | రూ.25.84 లక్షలు |
| మల్కాపురం | రూ.28.00 లక్షలు |
| మర్రిపాలెం | రూ.37.47 లక్షలు |
| మింది | రూ.36.93 లక్షలు |
| మురళీనగర్ | రూ.44.10 లక్షలు |
| ఎన్ఎస్‌టీఎల్ | రూ.34.58 లక్షలు |
| పెదగంట్యాడ(రూరల్) | రూ.13.65 లక్షలు |
| పెదగంట్యాడ(అర్బన్) | రూ.17.70 లక్షలు |
| శ్రీహరిపురం | రూ.39.13 లక్షలు |
| వడ్లపూడి | రూ.40.39 లక్షలు |
| **మొత్తం** | **రూ.4.19 కోట్లు** |

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు**



విద్యుత్ ప్రమాదాలను నివారించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గి వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4.19 కోట్లు మంజూరు చేసింది. జోన్–2 డివిజన్‌లోని 13 సెక్షన్లలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ, సహకరించాలి.

– బి.కోటేశ్వరనాయుడు, జోన్–2 ఈఈ, ఏపీఈపీడీసీఎల్

# 'సమష్టి కృషితో బీసీ సంఘం బలోపేతం'



కొణతాల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

**సీతంపేట:** ఉత్తరాంధ్రలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారని, అందరి సమష్టి కృషితో ఆంధ్రప్రదేశ్ వెనకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం బలోపేతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఉత్తరాంధ్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కోర్ కమిటీ తీర్మానం మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్నట్టు శ్రీనివాస్ ప్రకటించారు. తన గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొణతాల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి బొడ్డేపల్లి రామారావు, సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సనపల అన్నాజీరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కె.రామకృష్ణంనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి.అప్పలనాయుడు, మన్యం జిల్లా నుంచి రాఘవరావు, రమణ , విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గౌరీ సంఘం అక్కయ్యపాలెం శాఖ అధ్యక్షుడిగా వేణుగోపాల్



అధ్యక్షుడిగా వేణుగోపాల్‌కు నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారులు

**సీతంపేట:** గౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం (మూడుగుళ్ళు) శాఖ అధ్యక్షుడిగా కొయిలాడ వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో సారి ఎన్నికైన వేణుగోపాల్ 2025 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఎన్నికల అధికారులుగా కాండ్రేగుల వెంకటేశ్వరరావు, పాలమశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంఘం పెద్దలు కొయిలాడ వెంకటేష్, బొడ్డేటి మోహన్, సరిసా ప్రసాద్, రాజగిరి అప్పలరాజు, మళ్ళ త్రినాథ్, ఆడారి పారుపల్లి రవి, పెంటకోట సంజీవరావు నాయుడు, కర్రి శంకర్, కన్నా, పి.ఈశ్వరఅప్పారావు, చక్రి, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

### పందుల నిర్మూలన

**సీతమ్మధార:** ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సంచరిస్తున్న పందులను జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులు షూట్ చేశారు. స్టేషన్ ఆవరణలో గుంపులుగా పందులు సంచరిస్తుండడంతో స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదుదారులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై పందుల వీరవిహారం శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. పోలీస్ స్టేషన్ వద్ద వరాహాలను సంహరించారు. దీంతో ఫిర్యాదుదారులు ఊపిరి పీల్చుకున్నారు.

### నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**సీతమ్మధార:** ఏపీఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలోని డాక్టర్స్ కాలనీ ఫీడర్, ఎంఎంటీసీ కాలనీ ఫీడర్, 33/11 కేవీ, ఎంఎంటీసీ ఎస్ఎస్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఎ.ఎస్.ఎన్‌క్లేవ్, వైజాగ్ హైట్స్, సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎంఎంటీసీ కాలనీ, వేంకటేశ్వర స్వామి ఆలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, జేఆర్ ఎన్‌క్లేవ్, అచారి పోర్టు ఏరియా, క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఘనంగా 'మదర్ ఇండియా' వార్షికోత్సవం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గిరివర్మ

**సీతంపేట:** మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ మూడో వార్షికోత్సవం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూడేళ్లలో చేపట్టిన సేవలు, సాంస్కృతిక, ఉపాధి శిక్షణ కార్యక్రమాలతో రూపొందించిన సావనీర్‌ను ప్రముఖ వైద్యుడు ఎం.ఎస్.గిరివర్మ, తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మళ్ల వెంకటరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు సేవలందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బండే వెంకటేశ్వరరావు, ట్రస్ట్ మహిళాధ్యక్షురాలు మళ్ళ లక్ష్మి, సాంస్కృతిక విభాగ అధ్యక్షురాలు సత్యమాధవి పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

**మద్దిలపాలెం:** రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్, తదితర సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన వారోత్సవాలలో ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు డిప్యూటీ చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు.

## సమాచారమ్

### నేడు వైభవునికి తులసీ దళార్చన

**మురళీనగర్:** కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం తులసీ దళార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి ఉదయం నిర్వహించే ప్రత్యేక పూజలు అనంతరం 9 గంటలకు తులసీ దళార్చన, తరువాత సామూహిక విష్ణుసహస్ర నామార్చన ఉంటుందని పేర్కొన్నారు.

### నేడు సత్యసాయిబాబా వ్రతం

**మురళీనగర్:** పట్టాభిరెడ్డితోటలోని సత్యసాయిబాబా మందిరంలో పట్టాభిరెడ్డితోట భజన మండలి, మాధవధార సమితి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సత్యసాయిబాబా వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 4.45 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8 గంటలకు సత్యసాయిబాబా వ్రతం చేయనున్నారు. ఉదయం 12 గంటలకు ఆశ్రమం పిల్లలకు నారాయణసేవ, సాయంత్రం 5 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వేద పఠనం, నామ సంకీర్తన, 5.45 గంటలకు బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 6.30 గంటలకు జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సూర్యనారాయణ మాస్టారి ప్రసంగం, 7.30 గంటలకు అఖండ జ్యోతి మంగళ హారతి, ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# పారిశుధ్యం మెరుగుకు చర్యలు



వ్యర్థాలతో నిండిన శంకువానిపాలెం గెడ్డ(నాడు)



వ్యర్థాలు తొలగించిన తర్వాత గెడ్డ(నేడు)

సాక్షి ఎఫెక్ట్..

**సీతంపేట:** జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెంలో పలు ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగుకు జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి చర్యలు చేపట్టారు. 'అధ్వానంగా పారిశుధ్యం' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. వార్డులో నెలకొన్న అపారిశుధ్యంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెరుగైన పారిశుధ్యం అందించాలని సూచించారు. మరోసారి పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలని సూచించారు. ఈ మేరకు జోన్–3 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది శంకువానిపాలెం గెడ్డను హుటాహుటిన శుభ్రం చేశారు. గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం, శంకువానిపాలెం గెడ్డ వద్ద చెత్త కుప్పలను తరలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ వెన్నెల అప్పారావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

# డ్రాపవుట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఈవో చంద్రకళ

**విశాఖ విద్య:** డ్రాపవుట్ల నివారణకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. డ్రాపవుట్ సర్వేలో భాగంగా బడికి రాకుండా ఇళ్ల వద్దనే ఉంటున్నట్లుగా గుర్తించిన వారి వివరాలను తెలుసుకునేందుకు మంగళవారం రాత్రి ఆమె నగరంలోని న్యూకాలనీ, ధర్మనగర్ ఏరియాల్లో పర్యటించారు. సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, సీఆర్పీలు, సచివాలయ సిబ్బందిని వెంట తీసుకొని డ్రాపవుట్స్ పిల్లల ఇళ్లకు నేరుగా వెళ్లారు. వారి తల్లిదండ్రులు, సంరక్షకులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని వారికి వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు అందుతాయన్నారు. బడి ఈడు పిల్లలను ఇళ్ల వద్ద ఉంచుకునేందుకు వీల్లేదని, బడికి పంపించాల్సిందేనన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ వానపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతకు సత్కారం



అడ్మిన్ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న గోవింద్

**సీతంపేట:** జీవీఎంసీ 25వ వార్డు రెల్లివీధి సచివాలయ అడ్మిన్ రాజశేఖర్ గణతంత్ర దిన వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శాలువాతో సత్కరించి అభినందించారు. మిగిలిన ఉద్యోగులు రాజశేఖర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

**సచివాలయ కన్వీనర్లతో సమీక్ష**

జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్, రెల్లివీధి సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గాంధీనగర్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

**సీతమ్మధార:** అర్హతే ప్రాతిపదికగా, పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 24వ వార్డులోని గాంధీనగర్ సచివాలయం పరిధిలో టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అర్హత ఉండీ, పథకాలు అందని వారు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాలనలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలియజేశారు. వార్డు కార్పొరేటర్ సాడిపద్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, నాయకులు రాయుడు శ్రీను, నూకరాజు అశోక్‌రెడ్డి, కె.సుశీల, డి.రామకృష్ణారెడ్డి, కామేశ్వరరెడ్డి, సీతకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు



అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్న సీసీపీ సురేష్

**సీతమ్మధార :** ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం నుంచి రైతుబజారు వరకు ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన బడ్డీలను, కట్టడాలను తొలగించారు. ఇక్కడి బ్యాంక్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్డీలను రోడ్డుపై ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలమైందన్నారు. వాటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇకపై ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ



అవహగాన ర్యాలీలో పాల్గొన్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి తదితరులు

**కంచరపాలెం:** జోన్–5 పరిధి కంచరపాలెం కూడలిలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కావడంతో పాదచారులు ఇబ్బంది పడడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు కూడా ఫుట్‌పాత్ ఆక్రమణలు కారణమవుతున్నాయని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, వాహనాలు నిలిపినా, వ్యాపారాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, టీపీవో ఎం.శ్రీలక్ష్మి, గుమ్మిడి శ్రీను, జీవీఎంసీ, సచివాలయ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం రుక్మిణీ కల్యాణం



రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

**సీతంపేట:** లలితా పీఠం దర్బారు హాల్లో రుక్మిణీ సహిత శ్రీకృష్ణ కల్యాణం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రాలు, మేళ తాళాల మధ్య కుర్తాళం పీఠ ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రుక్మిణీ శ్రీకృష్ణుల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కమనీయంగా సాగాయి. రుక్మిణీ శ్రీకృష్ణులలోని ప్రేమతత్వం అందరిలో రావాలని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదేశాల మేరకు కల్యాణం జరిపిస్తున్నట్టు ఆస్థాన పండితులు తెలిపారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షించారు. ముందుగా కుమారి డాక్టర్ ప్రియాంక చేసిన భరతనాట్యం ఆహూతులను అలరించింది. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానందభారతీ స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధారణ తప్పనిసరి



కంచరపాలెం మెట్టు వద్ద అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

**మర్రిపాలెం:** గతేడాది హెల్మెట్ ధరించకుండా రోడ్డు ప్రమాదాలకు గురై 147 మంది ద్విచక్ర వాహనచోదకులు మృతి చెందారని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాటిచెట్లపాలెం, కంచరపాలెంమెట్టు, ఊర్వశి జంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్ అండ్ బీ, మర్రిపాలెం, కరాస ఎన్ఏడీ కూడలి, కాకానినగర్ తదితర కూడళ్లలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సీసీ ఫుటేజీల్లో ఉన్న ప్రమాద దృశ్యాలను చూపించి వాహనచోదకులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐలు ఉల్‌హక్, వాసుదేవరావు, పాపారావు, హెచ్‌సీలు సుబ్బారావు, కానిస్టేబుల్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సేవా రంగంలో టి.భవానీని సత్కరిస్తున్న అతిథులు

**సీతంపేట:** ఎన్.టి.రామారావు శత జయంత్యుత్సవాలు పురస్కరించుకుని దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళా పరిషత్ సంయుక్తంగా చేపడుతున్న నెల నెలా ఎన్టీఆర్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో నెల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. బేరి ఉమామహేశ్వరరావు చేసిన మిమిక్రీ, నగరానికి చెందిన గాయనీ గాయకులతో సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురిని నందమూరి స్మారక పురస్కారాలతో సత్కరించారు. సంఘ సేవకులు కంచర్ల అచ్యుతరావు, సినీ నిర్మాత బాలాజీ నాగలింగం, సామాజికవేత్త సన్‌మూర్తి, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్, కన్జూమర్ రైట్స్ ప్రతినిధి కుమార్ నాయక్, కళా పరిషత్ వ్యవస్థాపకుడు పి.ఎ.భాస్కరరావు పాల్గొన్నారు.

# కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



**దాబాగార్డెన్స్:** నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.